అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36(ఆదివారం)
కనిష్ఠం : 28

టిప్పర్ ఢీకొని నలుగురికి గాయాలు 7

అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

- రాష్ట్రవ్యాప్తంగా చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యులు 7
- అమలాపురంలో మూడు చోరీ కేసుల్లో వీరు నిందితులు
- రూ.40లక్షల విలువైన వెండి, బండారు ఆభరణాలు స్వాధీనం

ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్ 7

నేడే తుని చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక 7

ఘనంగా సర్వపృష్ఠాప్తో ర్యామ యాగం ప్రారంభం 7

జీజీహెచ్‌లో రాష్ట్రస్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ

- కాకినాడ ఆర్‌ఎంసీ, రాజమహేంద్రవరం జీఎస్‌ఎల్, అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలల నుంచి 100మంది జనరల్ సర్జరీ పీజీ వైద్య విద్యార్థుల హాజరు 7

టీడీపీ కార్యకర్తపై కత్తులతో దాడి

మెయిన్‌లో..

- పంట కోస్తుండగా కత్తులతో తెగబడిన వైసీపీ కార్యకర్తలు
- పొలం వివాదమే కారణం
- పెద్దాపురంలో ఘటన
- నకిలీ పత్రాలు సృష్టించి భూమి కొట్టేసేందుకు స్కెచ్?

చంద్రబాబుకు మత్స్యకారులు రుణపడి ఉంటారు

- మత్స్యకార భరోసా పెంపుపై హర్షం.. బాబు, పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం



ఓడలరేవులో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న రాష్ట్ర డైరెక్టర్ భీమరాజు

అల్లవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుకు మత్స్యకారులు రుణపడి ఉంటారని, మత్స్యకారుల భరోసాపెంచడం హర్షణీయమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ లంకే భీమరాజు అన్నారు. అల్లవరం మండలం ఓడలరేవులో మత్స్యకార భరోసా రూ20వేలకు పెంచిన సందర్భంగా టీడీపీ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకంచేశారు.సీఎం చంద్రబాబు ఇచ్చినహామీ నెరవేర్చారని మత్స్యకారనాయకులుపేర్కొన్నారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు కొల్లు విష్ణుమూర్తి, కొప్పాడి రామకృష్ణారావు, అవనిగడ్డ త్రిమూర్తులు, కొల్లు త్రిమూర్తులు, అంగాని శ్రీనివాసరావు, పెమ్మాడి ఈశ్వరరావు, జగతాడి శ్రీనివాసరావు, కొల్లాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఇది దేవరపల్లి మండలంలోని కృష్ణపాలెంలో వేసిన లేఅవుట్.. లే అవుట్ ఎక్కడుందని వెతుక్కుంటున్నారా.. ఈ కనిపించే చిత్రంలో ఉన్నది లేఅవుటే.. ఈ లేఅవుట్‌కు దారికూడా లేదు.. అయినా పేదలకు ఇచ్చేశారు.. ఇలా జిల్లాలో ఎన్నో ఉన్నాయి..

లే..ఔట్!

నివాసయోగ్యం కాని స్థలాలు రద్దు?

2019 ఎన్నికల ముందు అందరికీ ఇళ్లిస్తామంటే పేదలు నమ్మారు.. ఓటే శారు.. గెలిపించారు.. తీరా చూస్తే.. కొండలు.. గుట్టలు.. చివరికి శ్మశానాలు.. అదీ ఇదీ అని ఏముంది.. ఎక్కడ ఖాళీ జాగా కనిపిస్తే అక్కడ స్థలాలు ఇచ్చేశారు.. మా పనైందని గత పాలకులు చేతులు దులుపుకున్నారు.. తీరా చూస్తే చాలా లేఅవుట్లలో ఒక్కరూ ఇళ్లు నిర్మించుకోలేదు.. ప్రస్తుతం ప్రభుత్వం ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోకపోవడానికి కారణమేంటనే దానిపై దృష్టిసారించింది.. అనువుగా లేకపోతే రద్దు చేసే యోచనలో ఉంది.. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లాలో 59 లేఅవుట్లు రద్దు చేసినట్టు సమాచారం.

తూర్పుగోదావరి	
లేఅవుట్లు	526
మంజూరు	73,282
పూర్తయినవి	27,971
వివిధ దశల్లో	18,807
ప్రారంభంకానివి	26,504
వ్యయం	601.65 కోట్లు

కాకినాడ	
లేఅవుట్లు	698
మంజూరు	87,648
పూర్తయినవి	29,009
వివిధ దశల్లో	29,020
ప్రారంభంకానివి	29,619
వ్యయం	681.4 కోట్లు

కోనసీమ	
లేఅవుట్లు	702
మంజూరు	43,561
పూర్తయినవి	15,330
వివిధ దశల్లో	14,921
ప్రారంభంకానివి	13,310
వ్యయం	385.31 కోట్లు

- పేదింటి కల తీర్చేలా అడుగులు
- ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- లేఅవుట్లపై సర్కారుకు నివేదిక
- తూర్పున 59 లేఅవుట్లు రద్దు
- కాకినాడ, కోనసీమలో పరిశీలన
- కోట్లు ఖర్చు చేసి ఖాళీగా..
- పేదలను మోసగించిన జగన్
- కొత్త స్థలాల ఎంపిక యోచన
- పల్లకడియంలో 598 ఎకరాలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం పేదలందరినీ మోసం చేసింది. ఎంతో ఆశగా ఇళ్ల స్థలాలకు ఎదురుచూసిన పేదలకు నిరాశనే మిగిల్చింది.. ఇళ్ల స్థలాలకు పనికిరాని భూములను ఎంపిక చేసి పేదింటి ఆశను నీరుగార్చింది. గత ప్రభుత్వం పేదలందరికీ ఇళ్లిస్తామని చెప్పి నివాస యోగ్యం కాని ప్రాంతాల్లో హడావిడిగా భూమి సేకరించి.. లేఅవుట్లు సిద్ధం చేసింది. తూర్పుగోదావరి జిల్లాలో 526 ప్రాంతాల్లో హడావిడిగా లేఅవుట్లు వేస్తున్నట్టు ప్రకటించి కనీసం చాలా చోట్ల లేఅవుట్లు వేయలేదు.కొన్ని చోట్ల కాగితాలపై లేఅవుట్లు చూపించారు. జిల్లా వ్యాప్తంగా 73,282 మంది లబ్ధిదారులకు సెంటు,సెంటున్నర స్థలం వంతున పట్టాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే.కేవలం భూమిని మాత్రమే సేకరించి లేఅవుట్‌వేశారు.మౌలిక వసతులు మాటేమరిచారు. దీంతో 26,504 మంది అసలు ఇళ్ల నిర్మాణమే చేపట్టలేదు. ఆ లేఅవుట్లు రద్దు చేయనున్నారు.

కోనసీమ జిల్లాలో ఇలా..

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గత వైసీపీ ప్రభుత్వంలో చేపట్టిన గృహ నిర్మాణాలు మందకొడిగా సాగుతున్నాయి. చాలా ప్రాంతాల్లో నివాసయోగ్యం కాని స్థలాల్లో లేఅవుట్లను రద్దుచేసి అర్హులకు ఇవ్వాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. జిల్లాలో మొత్తం లేఅవుట్లు 702.. ఇళ్ల లబ్ధిదారులే 43,561 ఉండగా వివిధ దశల్లో ఉన్నవి 14,921,పూర్తయినవి 15,330, ప్రారంభంకానివి 13,310 ఉన్నాయి.. మొత్తం వ్యయం 385.31 కోట్లు వ్యయం చేశారు. ఇంత వరకూ ఇళ్ల నిర్మాణం ప్రారంభించని పట్టాదారుల ఆచూకీపై అధికారులు ఆరా తీసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్టు సమాచారం.

కాకినాడ జిల్లాలో ఇలా..

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరు చేసిన జగనన్న కాలనీలు లబ్ధిదారుల అనాసక్తితో వెలవెలబోతున్నాయి. కాకినాడ జిల్లా పరిధిలో 698 లేఅవుట్లు వేశారు. 87,648 మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. 29009 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకున్నారు. వివిధ దశల్లో 29020 ఇళ్లు ఉన్నాయి. 29619 ఇళ్లు అయితే ప్రారంభమేకాలేదు.ఈ లేఅవుట్లకు 681.4 కోట్లు వ్యయం చేశారు.నివాస ప్రాంతాలకు దూరంగా ఉండడం,పల్లపు ప్రాంతాలు కావడం,పొలాల మధ్య ఉండడం,సముద్రపు ప్రాంతాల్లో ఇవ్వడం వంటి పరిస్థితుల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపలేదు.

అర్బన్‌కు కేరాఫ్ పల్లకడియం

ఇక అర్బన్ ప్రాంతాల లబ్ధిదారులకు ఎంపిక చేసిన లేఅవుట్లు సరిగ్గాలేవు. బూరుగు పూడి, కాపవరం ఆవ ప్రాంతాల్లో లేఅవుట్ల ప్రతిపాదన వివాదాస్పదమైన సంగతి తెలి సిందే. దీనిపై కూడా ప్రస్తుత ప్రభుత్వం దృష్టిపెట్టింది. ఇప్పటికే వెలుగుబంద కాలనీలోని ఇళ్లను పూర్తి చేస్తుంది.రాజానగరం మండలం పల్లకడియం, కానవరం ప్రాంతాల్లో 12 లేఅ వుట్లకు 598.72 ఎకరాలు సేకరించారు. ఇక్కడ 22,898 మందికి ఇళ్ల నిర్మాణం చేయనున్నారు.గత ప్రభుత్వం సెంటు వంతున స్థలంతో పట్టాలు ఇచ్చి వదిలేసింది.ప్రస్తుత ప్రభుత్వం ఈ స్థలాల్లోనే రెండేసి సెంట్ల వంతున స్థలాలు ఇచ్చి ఇళ్లను నిర్మించడంతో పాటు, మిగిలిన వారికి టిడ్కో ఇళ్లు నిర్మించే యోచనలో ఉంది. బూరుగుపూడి, కాపవరం ప్రాంతాలు ఆవ ప్రాంతంలోని 11, 954 మంది ఎక్కడ ఇవ్వాలనే ఆలోచన చేస్తోంది.వీరంతా రాజమహేంద్రవరం అర్బన్ ప్రాంతానికి చెందిన లబ్ధిదారులే కావడం గమనార్హం.

చంద్రన్న అడుగులు

గతేడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ఘన విజయం సాధించి సీఎం నారా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల ముందు గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో లబ్ధిదారుడికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు స్థలం ఇస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్లను నిర్మించి ఇచ్చే ఆలోచన చేస్తున్నారు.అసలైన లబ్ధిదారులు ఎంత మంది? ప్రస్తుతం ఇళ్లు నిర్మించుకున్న వారెందరు? ఆయా ఇళ్లల్లో ఉంటున్న వారెందరో తెలుసుకునే చర్యలు చేపట్టింది. దీంతో అర్హులు, అనర్హుల జాబితా సిద్ధం చేసింది. ఇప్పటి వరకు కనీసం ఒక ఇటుక కూడా వేయకుండా ఖాళీగా ఉంచిన స్థలాల లెక్క తేల్చింది. ఆ పట్టాలను రద్దు చేసి,అర్హులైన నిరుపేదలకు కొత్తగా ఇచ్చే దిశగా అడుగులు వేస్తోంది.గత ప్రభుత్వంలా కాకుండా లబ్ధిదారులకు రెండు సెంట్ల భూమి ఇచ్చే ఆలోచన చేస్తోంది.

తూర్పున రద్దు లేఅవుట్లు ఇవే

నివాస యోగ్యంకాని 59 లేఅవుట్లు ఇలా ఉన్నాయి.కడియం మండలం వేమగిరి-3 (జడ్పీ స్థలం).కోరుకొండ మండలం నర్సాపురం- కనపూరు రోడ్డు,జగన్నాథపురం-1,రంగంపేట మండలం వడిశలేరు లేఅవుట్-2, చంద్రేడు లేఅవుట్ -1,ముకుందవరం-2,ఈలకొలను, ఈలకొలను-2, నల్లమిల్లి లేఅవుట్ -1, వీరంపాలెం-1, దేవరపల్లి మండలం జగన్నాథపురం రోడ్డులో లేఅవుట్,బుచ్చియ్యపాలెం, కొండగూడెం హౌసింగ్ బోర్డు,గౌరీపట్నం రజకుల చెరువు, యర్నగూడెం పోలేరమ్మ టెంపుల్ లేఅవుట్, కృష్ణపాలెం,ధుమంతునిగూడెం,పల్లంట,కురు కూరు, రాతిగుంటచెరువు లేఅవుట్లు ఉన్నాయి. గోపాలపురం మండలం నందిగూడెం-1, భీమోలు -1 ,వడలకుంట-2,గోపాలపురం- 2,3,4,5, వేళ్లచింతలగూడెం-1,కరగపాడు-2, నల్లజర్ల మం డలం నబీపేట-2, నల్లజర్ల -4, జగన్నా థపు రం-2, అచ్చన్నపాలెం, సింగరాజుపాలెం-1,2,3 లేఅవుట్లు.నిడదవోలు మండలం తాడిమళ్ల -2, శెట్టిపేట టిడ్కో,ఎస్సీ పేట రామాలయం దగ్గర లేఅవుట్.పెరవలి మండలం ఎలిమెంటరీ స్కూల్ దగ్గర లేఅవుట్, అసైన్డ్‌లాండ్ లేఅవుట్, పాల ఆది నారాయణ షెడ్ దగ్గర లేఅవుట్, రవళి స్పిన్నింగ్ మిల్లు వెనుక,ఎస్సీ పుంత, పిరమిడ్ జ్ఞాన మందిర లేఅవుట్, ఉండ్రాజవ రం మండలం అజ్జరం కాలనీ లేఅవుట్లు ఉన్నాయి.

ఉగ్ర ఘటనను నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన



జమ్మూకాశ్మీర్‌లోని పహెల్గావ్‌లో జరిగిన ఉగ్రఘటనను నిరసిస్తూ ముమ్మిడివరంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అమలాపురం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సోమవారం 10గంటలనుంచి కలెక్టరేట్ లోని గోదావరి భవన్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చిపరిష్కార మార్గాలు పొందాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా స్థాయితోపాటు రెవెన్యూ డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిల్లో కూడా ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం జరుగుతుందన్నారు. రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఆర్డీవోలు అర్జీలు స్వీకరిస్తారన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులతోపాటు మండలస్థాయి అధికారులంతా పాల్గొనాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



ఆలమూరు మండలంలోని జొన్నాడ-కాకినాడ రోడ్డు

విస్తరణ షురూ!

ఆలమూరు,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరికి సంబంధించి జొన్నాడ-కాకినాడ,వేమగిరి-కాకినాడ(కెనాల్‌రోడ్డు) రోడ్లు పబ్లిక్, ప్రైవేట్, పార్టనర్‌షిప్(పీపీపీ) విధానంలో విస్తరణానికి నిర్ణయం తీసుకున్నారు. నిత్యంరద్దీగా ఉండే ఈ రహదారుల విస్తరణ చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ముఖ్యంగా ఆలమూరు మండలం జొన్నాడ జాతీయరహదారినుంచి కాకినాడ వరకు గల 53.6 కిలోమీటర్ల రహదారిని విస్తరించాలనే డిమాండ్ దశాబ్దాలకాలంగా ఉంది. ఈ రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. ఎందుకంటే గ్రామాల మీదుగా వంకరటింకరగా ఐదు నుంచి ఏడు మీటర్ల వెడల్పుతో ఉంది.

- జొన్నాడ-కాకినాడ రోడ్డు విస్తరణకు ఏర్పాట్లు
- పీపీపీ విధానంలో రోడ్డు నిర్మాణం
- 53కిలోమీటర్ల దూరం
- మొదలైన ట్రాఫిక్ సర్వే

భూ సేకరణ సమస్య

ఆలమూరు, కరప, వేళంగి ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ ఇబ్బందికరంగా ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో రోడ్డు విస్తరించడానికి ఇల్లు, షాపులు వంటివాటిని తొలగించడానికి భూసేకరణ సమస్య ఏర్పడనుంది. అందుకునే ఆయాప్రాంతాల్లో గ్రామం అవతలనుంచి భూసేకరణ చేపట్టి రోడ్డు నిర్మాణం జరిగితే భవిష్యత్‌లో ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని పాలకులు, అధికారులు ఎప్పటినుంచో సూచిస్తున్నారు. ఈ వంకర్లు లేకుండా కొత్తగా రోడ్డు నిర్మించడంవల్ల రోడ్డు ప్రమాదాలు కూడా అరికట్టవచ్చునని అధికారులు ఎప్పటినుంచో నివేదికలు ఇస్తున్నారు. ఇప్పుడు తాజా పీపీపీలో రోడ్డు నిర్మాణం చేపట్టినప్పుడు రోడ్డు మళ్లింపు సంబంధించి కూడా సర్వేలు చేపడుతున్నారు. ఏఏ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు ఎలా ఉన్నాయని లెక్కించే బాధ్యతను ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించారు. వారం రోజులుగా ఈ రోడ్డులో పలుచోట్ల ట్రాఫిక్ సర్వేలు చేపట్టారు. ఆలమూరు మండలానికి సంబంధించి గుమ్మిలేరువద్ద ఈ సర్వే జరిగింది. దీనిఆధారంగా ఈ రోడ్డును పది మీటర్లుగా విస్తరించాలా లేక 14 మీటర్లతో నాలుగు లైన్లుగా విస్తరించాలా అనే విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. టోల్‌గేట్లు ద్వారా పీపీపీ విధానంలో రోడ్డు నిర్మించి ఖర్చును సంబంధిత కాంట్రాక్టు సంస్థ తిరిగి రాబట్టుకోవాల్సి ఉంది. అందువల్ల ఎక్కడా టోల్‌గేట్లు పెట్టాలి.. అసలు ఈ రోడ్డు ఏ మేరకు విస్తరించాలి అనే విషయాలు ఈ ట్రాఫిక్ సర్వే ఆధారంగా నిర్ణయిస్తారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆలమూరు, మండపేట, రాయవరం, రామచంద్రపురం, కరప, కాకినాడ రూరల్ మీదుగా వెళ్లే వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా మారనుంది.

త్వరలోనే ప్రారంభం

వేమగిరి-కాకినాడ మధ్యగల 62కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు సంబంధించి భూసేకరణ సమస్యలేదు. అక్కడ రెండు దశాబ్దాల క్రితమే 14మీటర్లు వెడల్పుతో నాలుగు లైన్లు రహదారి విస్తరణకు టెండర్లు పిలిచి కాంట్రాక్టు కూడా అప్పట్లో అప్పగించారు. రోడ్డు మొదలు పెట్టిన వెంటనే అప్పటినుంచి ఆ రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోయాయి. ఇప్పుడు పీపీపీలో రోడ్డువిస్తరణకు సంబంధించి వారంరోజులుగా ట్రాఫిక్ సర్వే చేపడుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ రెండు రహదారుల పనులు త్వరలోనే ప్రారంభం కావడానికి ముమ్మర సర్వే చేపడుతున్నారు.

నేషనల్ లోక్ అదాలత్ జూలై 5కు వాయిదా

అమలాపురంటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మే 10న జరగాల్సిన నేషనల్ లోక్‌అదాలత్‌ను జూలై 5కు వాయిదా వేసినట్టు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ తెలిపింది. కోర్టులో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, చెక్‌బౌన్స్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చని, జూలై 5న ఉదయం 10.30 గంటల నుంచి నేషనల్ లోక్ అదాలత్ జరుగుతుందని కమిటీ స్పష్టం చేసింది.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు

అమలాపురంటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రథమశ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6 వరకు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ అధికారి కృష్ణవర్మ తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు విద్యార్థులకు కథలు చెప్పడం, కథలు చదివించడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. చదరంగం పోటీలు కూడా నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాఠశాల స్థాయి విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించుకోవాలని కృష్ణవర్మ కోరారు.

ఆ అరకిలోమీటరే అవాంతరం



మామిడికుదురువద్ద 216 రహదారిపై జరుగుతున్న మట్టి పనులు

- 216 హైవే అభివృద్ధిలో ఆ అరకిలోమీటరు వద్దే బ్రేక్!
- కడలి నుంచి మామిడికుదురు మార్గంలో న్యాయపరమైన చిక్కులు
- స్థానిక రైతులతో మాట్లాడి ఒప్పిస్తున్న అధికారులు
- పాశర్లపూడి-మామిడికుదురు మధ్య రోడ్డు నిర్మాణ పనులు
- ఇది పూర్తయితే.. 216 హైవే పూర్తిస్థాయిలో విస్తరణ

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జాతీయ రహదారుల అభివృద్ధికి అడుగడుగునా అవరోధాలు ఏర్పడుతున్నాయి. కత్తిపూడి నుంచి పామర్రు వరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మీదుగా వెళ్లే జాతీయ రహదారి 216 అభివృద్ధి, విస్తరణలో కేవలం ఒక అరకిలోమీటరు రహదారి అభివృద్ధి అవరోధంగా మారింది. ఆరహదారికి ఇరువైపులా ఉన్న కొందరు భూయజమానులు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కొందరు నష్టపరిహారం పెంచాలనే డిమాండ్‌తో కోర్టుకు వెళ్లడంతో కొన్ని సంవత్సరాల నుంచి అరకిలోమీటరు రహదారి ఏర్పాటుకు అంతరాయం ఏర్పడింది. అధికారులు ఈ రహదారి నిర్మాణంలో చొరవ చూపి పనులు చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఆ ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు.

వాహనదారులకు ఉపయోగకరం

216 జాతీయ రహదారి అభివృద్ధి, విస్తరణలో భాగంగా కోనసీమలో పలుచోట్ల బైపాస్ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ముమ్మిడివరం, అనాతవరం, అమలాపురం బైపాస్ పూర్తిగా అభివృద్ధి రవాణా సౌకర్యాలకు మార్గం సుగమమైంది. యానాం నుంచి చించినాడ వరకు ఉన్న 216 రహదారిలో పాశర్లపూడి నుంచి మామిడికుదురు వరకు రహదారి నిర్మాణంలో కొన్ని అవాంతరాలు ఏర్పడ్డాయి. కడలి నుంచి చించినాడ వరకు అద్భుతమైన బైపాస్ రోడ్డు నిర్మితమైంది. కడలి నుంచి మామిడికుదురు వచ్చే రహదారి అభివృద్ధిలో న్యాయపరమైన చిక్కులతో నిర్మాణానికి నోచుకోలేదు. మామిడికుదురు నుంచి పాశర్లపూడి వెళ్లే రహదారిని కలిపే ఒక అరకిలోమీటరు మేర రోడ్డు విస్తరణ విషయంలో కొందరు భూయజమానులు కోర్టులను ఆశ్రయించడంవల్ల ఏర్పడ్డ జాప్యాన్ని క్లియర్ చేసే పనిలో ఉన్నారు. దీంతో మళ్లీ కడలి వైపునుంచి మామిడికుదురు వరకు రహదారి అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ప్రస్తుతం కొన్నిచోట్ల రోడ్డును మట్టితో లెవెల్ చేసే పనిలో కాంట్రాక్టర్లు ఉన్నారు. కొందరు భూయజమానులు ఆర్బిటేషన్‌కు వెళ్లడంతో అధికారులు వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. పాశర్లపూడి-మామిడికుదురు మధ్యలో ఎలైన్‌మెంట్ మార్చడంవల్ల తాము నష్టపోతున్నామంటూ కొందరు సీబీఐతో విచారణ జరిపించాలంటూ కొందరు నిరసన కూడా తెలిపారు. రైతులకు పరిహారం అందిస్తామని అధికారులు హామీ ఇచ్చి ప్రస్తుతం 216 రహదారి అరకిలోమీటరు మేర అభివృద్ధి చేయడానికి చొరవ చూపుతున్నారు. ఇది పూర్తయితే కోనసీమ జిల్లావ్యాప్తంగా 216 రహదారి అభివృద్ధి, విస్తరణ పూర్తయి వాహనదారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ న్యాయపరమైన చిక్కుల పరిష్కారంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, దేవ వరప్రసాద్ తదితరులు స్థానికులతో మాట్లాడి వారిని అంగీకరింప చేయడం ద్వారా రోడ్డు అభివృద్ధికి క్లియరెన్స్ లభించినట్టయింది.

దైవ దర్శనానికి వెళ్తుండగా లారీ రూపంలో మృత్యువు

- భక్తులను ఢీకొనడంతో ఒకరు మృతి
- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- పుల్లలపాడు హైవే వద్ద ఘటన


మరణించిన అంజి (ఫైల్)

నల్లజర్ల ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి నుంచి ద్వారకా తిరుమల దైవదర్శనం కోసం కాలినడకన వెళ్తున్న భక్తులను లారీ ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలై చికిత్స పొందుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో దేవరపల్లికి చెందిన బిరదా అంజి (25) మృతి చెందాడు. వివరాల ప్రకారం... దేవరపల్లికి చెందిన బిరదా అంజి, దాసు దుర్గాప్రసాద్, జాజు మొగ్గల సాయితేజ శనివారం రాత్రి దేవరపల్లి నుంచి ద్వారకా తిరుమల దైవ దర్శనం కోసం కాలినడకన బయలుదేరారు. ఆదివారం తెల్లవారుజామున పుల్లలపాడు హైవే వద్ద వచ్చేసరికి వైజాగ్ నుంచి బళ్లారికి ఇసుప ఊసలు తీసుకెళ్తున్న లారీ వెనుక నుంచి వారిని ఢీకొంది. అంజి కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్ర రక్తస్రావం కాగా, మిగిలిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. అంజిని మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు. ఎస్‌ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుడిని దింపేందుకు వస్తూ..

టిప్పర్ ఢీకొని నలుగురు యువకులకు తీవ్ర గాయాలు

ఒకరి పరిస్థితి విషమం



గాయపడిన యువకులు

ముమ్మిడివరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌పై వెళ్తున్న నలుగురు యువకులను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పండువారిపేటకు చెందిన ఉందుర్తి బాలు, కాకినాడ రూరల్ మండలం గొల్లపాలేనికి చెందిన ఖండవల్లి రాజు, అయినవిల్లి మండలం శంకరాయగూడానికి చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావు, ఐ.పోలవరం మండలం టి.కొత్తపల్లి పండువారి పేటకు చెందిన బి.వినోద్ స్నేహితులు. వారు ఆదివారం కాకినాడ, అక్కడి నుంచి యానాం వెళ్లి ఒకే మోటారు సైకిల్‌పై తిరిగి వస్తుండగా 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. శంకరాయగూడానికి చెందిన నిడుమోలు ఉమామహేశ్వరరావును ఇంటి వద్ద దింపేందుకు వారు వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. గాయపడినవారిలో ఉందుర్తి బాలు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. క్షతగాత్రులను అంబులెన్సులో అమలాపురం ఆసుపత్రికి తరలించారు. ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యానికి డబ్బులివ్వలేదని.. స్నేహితుల చేతుల్లో యువకుడి హత్య


గౌతమ్ (ఫైల్‌ఫొటో)

కాకినాడ క్రైం, ఏప్రిల్ 26 (ఆంధ్ర జ్యోతి): మద్యానికి డబ్బులివ్వలేదని నలుగురు కలిసి ఓ యువకుడిని హత్య చేసిన సంఘటన ఆదివారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నివశిస్తున్న మీసాల గౌతమ్ (27)కు తండ్రి రమేష్, తల్లి జ్యోతి, సోదరి గాయిత్రి ఉన్నారు. కాగా గౌతమ్ ఆటోడ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబానికి ఆసరాగా ఉంటాడు. అతడు స్థానిక రేచర్లపేటలోని గుర్రాల వారి వీధిలో ఉంటున్న ఓ యువతిని ప్రేమించాడు. ఈ విషయాన్ని గౌత మ్ తన తల్లిదండ్రులకు చెప్పగా కులాంతర వివాహం కావడంతో వారు పెళ్లికి ససేమిరా ఒప్పుకోలేదు. దాంతో గౌతమ్ ఇంటి వద్ద నుంచి వచ్చేసి గత కొన్ని రోజులుగా ఆ యువతి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో గౌతమ్‌కి స్నేహితులైన నలుగురు యువకులు ఆదివారం ఉదయం తాను ఉంటున్న ఇంటి వద్దకు వచ్చి మద్యం తాగేందుకు డబ్బులివ్వాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వారి మధ్య వాగ్వాదం జరిగింది. దాంతో క్షణికావేశంలో ఉన్న ఆ నలుగురు పక్కనే ఉన్న కాంక్రీట్ సిమెంట్ రాయితో గౌతమ్ తలపై, ముఖంపై విచక్షణా రహితంగా మోది అక్కడ నుంచి పరారయ్యారు. తీవ్ర రక్త స్రావంతో రక్తపు మడుగులో పడి ఉన్న గౌతమ్‌ను స్థానిక అంబులెన్స్‌లలో జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కేవీఎస్ హాకీ పోటీల విజేత 'కాకినాడ'


కాకినాడ జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కాకినాడ కేంద్రీయ విద్యాలయంలో కేవీఎస్ హైదరాబాద్ రీజనల్ స్థాయి హాకీ పోటీలు ఉత్సాహంగా సాగాయి. బాలుర విభాగంలో కాకినాడ కేంద్రీయ విద్యాలయం విజేతగా నిలిచింది. పోటీలకు హైదరాబాద్ రీజియన్ పరిధిలోని వెంకటగిరి, కరీంనగర్, కాకినాడ కేంద్రీయ విద్యాలయాల నుంచి 45 మంది బాలురు, విజయవాడ, రాజంపల్లి కేంద్రీయ విద్యాలయాల నుంచి 24మంది బాలికలు హాజరయ్యారు. క్రీడా ఉత్సవానికి శ్రీకారం చుట్టిన కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బొంత శేఖర్, జిల్లా స్థాయి డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ అధ్యక్షుడు విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని అర్థం చేసుకోవాలన్నారు. ఆరోగ్యకరమైన పోటీ భావనతో ఆటల్లో పాల్గొన్నాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ప్రతిభను వెలిబుచ్చాలని ఆకాంక్షించారు. బాలుర విభాగంలో కాకినాడ కేంద్రీయ విద్యాలయ మొదటి స్థానం, వెంకటగిరి కేంద్రీయ విద్యాలయం రెండోస్థానం, కరీంనగర్ మూడోస్థానం సాధించాయి. బాలికల విభాగంలో రాజంపల్లి మొదటి, విజయవాడ రెండోస్థానంలో నిలిచాయి. మొదటిస్థానంలో నిలిచిన కాకినాడ, రాజంపల్లి జట్లు జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు కేవిఎస్ తరఫున అబ్జర్వర్‌గా కేంద్రీయ విద్యాలయ ఓఎన్‌జీసీ నుంచి కె.మధుసూధనరావు హాజరయ్యారు.

ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విష్ణువర్ధన్

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు


డాక్టర్ విష్ణువర్ధన్

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ రంగరాయ వైద్య కళాశాల (ఆర్‌ఎంసీ) ప్రిన్సిపాల్‌గా డాక్టర్ అట్లూరి విష్ణువర్ధన్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం పూర్తిస్థాయి డీఎంఈగా విజయవాడకు బదిలీ అయ్యారు. 1982 ఎంబీబీఎస్ బ్యాచ్‌కు చెందిన డాక్టర్ విష్ణువర్ధన్ సిద్దార్థ వైద్య కళాశాలలో చదివారు. అనంతరం ఆయన 1991లో మణిపాల్ కస్తూర్‌బా మెడికల్ కాలేజీలో అనస్థీషియాలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. తదుపరి 1997లో ఆర్‌ఎంసీలో అనస్థీషియా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో చేరిన ఆయన 2006లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2015లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది అక్కడే విధులు నిర్వర్తించారు. అనంతరం 2023 ఫిబ్రవరి నుంచి అనస్థీషియా హెచ్‌వోడిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2022 ఆగస్టు నుంచి ఆయన ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. ఆయన హయాంలో ఆర్థో, ఈఎన్‌టి, న్యూరో సర్జరీ ఎమర్జన్సీకి రెండు ఆపరేషన్ థియేటర్‌లు ప్రారంభించారు. డాక్టర్ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో గడిచిన సంవత్సరకాలంలో 14 వేల మేజర్ సర్జరీలు నిర్వహించారు. అలాగే కెఎస్‌పిఎల్ సంస్థ సహకారంతో రూ.1.25 కోట్ల నిధులతో మౌళిక సదుపాయాలను అనస్థీషియా విభాగానికి స మకూర్చారు. 5 అనస్థీషియా మెషిన్‌లు, 3 వెం టీలేటర్‌లు, ఒక ఇంక్యుబేటింగ్ బ్రాంకోస్కోప్, ఒక అల్ట్రా సౌండ్ మెషిన్ సమకూర్చారు. ఈ ఏడాది కెఎస్‌పిఎల్ సంస్థ సహకారంతో ట్రామాకేర్ యూనిట్‌కు రూ.55 లక్షల నిధులతో 3 వెం టీలేటర్‌లు, 8 ఐసీయూ పడకలు, మరో 8 మ ల్టీ పేరా మానిటర్స్ సమకూర్చారు. ఆయన సేవలకు గుర్తింపుగా అనేక అవార్డులను అందుకున్నారు.

ముగ్గురు దొంగలు..17 కేసులు

- అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు
- రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం
- కోనసీమ జిల్లా ఎస్పీ వెల్లడి



అమలాపురంలో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు, అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్

అమలాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత మూడేళ్లలో వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డ ముగ్గురితో కూడిన అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం పట్టణ పరిధిలో కురసాలవారివీధిలో 2 ప్రాంతాల్లోను, గాంధీనగర్‌లో ఒకచోట దొంగతనాలకు పాల్పడ్డ ఈ అంతర్‌రాష్ట్ర ముగ్గురు సభ్యుల ముఠా నుంచి రూ.40లక్షల విలువైన వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యులపై వివిధ జిల్లాల్లో మొత్తం 17 కేసులు ఉన్నాయి. ఈ వివరాలను అమలాపురం ఎస్పీ కార్యాలయ కాన్ఫరెన్సు హాలులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు.

జనవరి 11న అమలాపురంలోని కురసాలవారివీధిలో గల ఒక ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు తలుపు బోల్టు తీసి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని బంగారం, నగదు దొంగిలించుకుపోయారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో నమోదైన ఈ కేసుకు సంబంధించి పల్నాడు జిల్లా నర్సారావుపేట మండలం పమిడిపాడు గ్రామానికి చెందిన జంగా వెంకట్రావు (33), అదే జిల్లాలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన దమ్ము సుధాకర్, గుంటూరు అర్బన్ జిల్లా శ్రీరామ్‌నగర్‌కు చెందిన కాట్ల కిశోర్‌బాబు (35)లు నర్సాపురంలో ఆభరణాలు విక్రయిస్తుండగా ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. వారి నుంచి 400 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురు గతంలో కోనసీమలోని రావులపాలెం పోలీసుస్టేషన్‌లో 1, అమలాపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో 1, తూర్పుగోదావరిలో 2, ఏలూరులో 3, గుడివాడలో 1, నంద్యాల 2, కడక 1, కర్నూలు 1, అనంతపురం 1, పశ్చిమగోదావరి 1, అన్నమయ్య జిల్లా 1 కేసుల్లో గతంలోనే నిందితులుగా ఉన్నారు. అలాగే మిర్యాగూడాలో 15 కేసుల్లో, నంద్యాల జిల్లాలో 2 కేసుల్లోను ఇప్పటికే వారు అరెస్టు అయినట్టు ఎస్పీ చెప్పారు. ముగ్గురి నుంచి సుమారు రూ.40లక్షలు విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విలేకర్ల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ కేసు చేదించడంలో కీలకంగా పనిచేసిన సీఐలు వీరబాబు, గజేంద్ర ఎస్‌ఐ కిశోర్‌బాబు, క్రైమ్ ఏఎస్‌ఐ అయితాబత్తుల బాలకృష్ణ, పోలీసులకు ఎస్పీ రివార్డు, ప్రశంసాపత్రాలు అందించి వారిని అభినందించారు.

రాష్ట్రంలో మంచి పాలన

ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర
గంగాలమ్మతల్లి జాతరలో ప్రత్యేక పూజలు


జాతరలో ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి రవీంద్ర

నల్లజర్ల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయానికి వెళితే ఎక్కడా పవిత్రత అనేది కనిపించలేదని, ప్రస్తుతం రాష్ట్రంలో మంచి పాలన కొనసాగిస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో గంగాలమ్మ తల్లి జాతరకు ఆయనతో పాటు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, మాజీ మంత్రి పీతల సుజాత, జిల్లా పరిషత్ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, రాష్ట్ర అంగన్‌వాడీ విభాగ అధ్య క్షురాలు ఆచంట సునీత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మంత్రి, ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకతీతంగా సంప్రదాయాన్ని గౌరవించడంతో పాటు ఆలయాల పవిత్రతను కాపాడాలన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈరోజు అదే ఆలయానికి వెళితే మనస్సుకు ప్రశాంతత కలిగిందన్నారు. స్వార్థ రాజకీయాల కోసం కుల, మతాల మధ్య చిచ్చుపెట్టొద్దన్నారు. అందుకు భగవంతుడు తగిన బుద్ధి చెప్పి ఇంటికి పంపించాడన్నారు. అందుకే 164 సీట్లను కూటమి ప్రభుత్వం కైవసం చేసుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.259 కోట్ల మత్స్యకార కుటుంబాలకు రూ.20 వేలు చొప్పున అందించిన ఘనత సీఎం చంద్రబాబుదే అన్నారు. ఘంటవారిగూడెంలో 100ఏళ్ల తరువాత జాతర జరగడం ఆనందదాయకమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్య నారాయణ, రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ మీరా సాహెబ్, కూచిపూడి ఉదయ భాస్కర్,నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి తదితరులున్నారు.

నేడు తుని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక

తుని రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మున్సిపాల్టీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సోమవారం జరగనుంది. ఈ రెండు పదవులకు టీడీపీ అభ్యర్థుల ఎంపిక లాంఛనమే. 30 మంది సభ్యులుగా గల తుని మున్సిపాల్టీలో టీడీపీకి 17 మంది సభ్యులు బలం ఉంది. దీంతో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక అవకాశం ఉంది. ఇప్పటికే చైర్మన్, వైస్ ఎన్నికపై మున్సిపల్ కౌన్సిలర్లు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు సమక్షంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధం చేశామని కమిషనర్ ఎ.వెంకట్రావు తెలిపారు. ఇప్పటికే కౌన్సిల్ సభ్యులు, ఎమ్మెల్యే యనమల దివ్యకు సమాచారం అందించామన్నారు. ఉదయం 11గంటలకు ఎన్నికల అధికారి, డీపీవో వి.రవికుమార్ సమక్షంలో ఎన్నిక జరుగుతుందన్నారు. ప్రత్యేక పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని పోలీసుల ఉన్నతాధికారులకు లేఖ రాశామన్నారు. కేవలం ఓటింగ్‌లోనే పాల్గొనే సభ్యులు, గుర్తింపుకార్డు పొందిన పాత్రికేయులకు మాత్రమే అనుమతిఉంటుందని తెలిపారు.

తొండవరంలో సర్వపృష్ఠాప్తోర్యామ యాగం


యాగం నిర్వహిసున్న పండితులు

అంబాజీపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లోకకల్యాణార్థం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం గ్రామంలో సర్వపృష్ఠాప్తోర్యామ యాగం ఆదివారం అమవాస్యనాడు ఘనంగా ప్రారంభమైంది. 60ఏళ్ల క్రితం నిర్వహించిన ఈయాగాన్ని తిరిగి తొండవరం శ్రీ తొండేశ్వర స్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో టీటీడీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి దువ్వూరి ఫణి యజ్ఞేశ్వరయాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. దు వ్వూరి వెంకట సూర్య ప్రకాశయజ్వ -కనకదుర్గా దంపతులు యాగ కర్తలుగా వ్యవహరించారు. సర్వపృష్ఠాప్తోర్యామ యాగంలో(మహాగ్నిచయనం) భాగంగా ప్రత్యేక ఆకారాలు కలిగిన వెయ్యి ఇటుకలను ప్రత్యేక మంత్రాలతో అమరుస్తామని, ఇలా పేర్చిన ఇటుకలన్నీ గురుడపక్షి ఆకారాన్ని సంతరించుకుంటాయన్నారు. ఈ యాగాన్ని దువ్వూరి యజ్ఞేశ్వరపౌండరీక యాజులు 60ఏళ్ల క్రితం కపిలేశ్వరపురంలో నిర్వహించారు. అమవాస్యనాడు ఈ యాగాన్ని ప్రారంభించడం ఎంతో శక్తివంతమైందన్నారు. 10రోజులు జరిగే ఈ యాగంలో వివిధ కార్యక్రమాలు, క్రతువులు ఉంటాయని, యాగాన్ని వీక్షిస్తే మంచి జరుగుతుందని వేదపండితులు తెలిపారు.

జీజీహెచ్‌లో రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ

జీజీహెచ్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జీజీహెచ్ జనరల్ సర్జరీ విభాగం నందు రోడ్డు ప్రమాదాలు, ఇతర గాయాలకు సంబంధించి ఆదివారం రాష్ట్ర స్థాయి ప్రాంతీయ వైద్యవిద్యా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి కాకినాడ ఆర్‌ఎంసీ, రాజమహేంద్రవరం జిఎస్‌ఎల్ మెడికల్ కాలేజ్, అమలాపురం కిమ్స్ మెడికల్ కాలేజ్‌ల నుంచి సుమారు 100మంది జనరల్ సర్జరీ పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. అలాగే కాకినాడ, గుంటూరు, విజయవాడ, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ జయపాల్‌రెడ్డి, డాక్టర్ మోహన్‌రావు, డాక్టర్ సాగర్ బాబు, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ రాంమోహన్ పాల్గొని వైద్య విద్యార్థులకు నూతన శస్త్రచికిత్సా విధానాలు, నూతన మెళకువలు, అనుభవాలను పంచుకున్నారు. అనంతరం చర్చా సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంఈ డాక్టర్ డిఎస్‌విఎల్ నరసింహం మాట్లాడారు. విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. ఆర్‌ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవిష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంపీఆర్ విఠల్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మనాభన్ శ్రీనివాసన్, సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ ఎన్.శ్రీనివాస్‌రావు, డాక్టర్ శైలజ, డాక్టర్ శైలజారాణి ఉన్నారు.


జ్ఞాపిక అందజేస్తున్న డాక్టర్ విఠల్

సత్యదేవుని కల్యాణోత్సవాలకు ఆహ్వానం


దేవదాయ మంత్రికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈవో సుబ్బారావు


అన్నవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో వచ్చే నెల 8న జరిగే స్వామి వారి దివ్యకల్యాణానికి విచ్చేయాలని ఆదివారం దేవదాయమంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి ఈవో సుబ్బారావు ఆహ్వానపత్రికను అందజేశారు. కల్యాణోత్సవాలు వచ్చే నెల 7 నుంచి 13 వరకు జరగనున్నాయి. కల్యాణోత్సవ ఏర్పాట్లను ఈవో మంత్రికి వివరించగా ఎటువంటి ఇబ్బందులు రాకుండా నిర్వహించాలని సూచించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం పవన్‌కు ఆహ్వానపత్రికను అందజేయగా.. 2,3రోజుల్లో మిగిలినవారికి అందజేస్తామని దేవస్థానం వర్గాలు తెలిపాయి.

రూ.లక్ష విరాళం

రత్నగిరిపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి ఆదివారం సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన ఇసరపు మానేశ్వరరావు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ప్రోటోకాల్ అధికారి శొంఠి మూర్తికి అందజేయగా ఆయన అభినందించి స్వామి వారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు.


విరాళం అందజేస్తున్న దాత

'లోవ'లో గంధామావాస్య వేడుకలు


విశేష పుష్పాలంకరణలో దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో గంధామావాస్య వేడుకలు వైభవంగా జరిగాయి. ఆదివారం అమ్మవారికి విశేష పూల అలంకరణ గావించి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిమంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించారు. మొక్కులు చెల్లించి కుటుంబ సమేతంగా ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసుకుని భోజనాలు చేశారు. ఆలయానికి రూ.3.05 లక్షలు ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథ్‌రాజు తెలిపారు.

స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, నీట్ సిలబస్

తిరుమల విద్యాసంస్థల చైర్మన్

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు తిరుమల విద్యాసంస్థల్లో ఆదివారం జరిగిన అవగాహన సదస్సుకు విద్యార్థులు వారి తల్లి దండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా చైర్మన్ తిరుమలరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మన పిల్లలు నిలబడాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ, నీట్ పరీక్షలకు సంబంధించిన సిలబస్‌ను వారికి అందించాలని అప్పుడే పరీక్షల్లో ఎటువంటి ఒత్తిడి లేకుండా రాయగలుగుతారని తెలిపారు. పిల్లలు భవిష్యత్తులో ఐఐటీ, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మకమైన జాతీయస్థాయి కళాశాల్లో విద్యనభ్యసించాలంటే స్కూల్ స్థాయి నుంచే ఐఐటీ మెడికల్ ఫౌండేషన్‌పై విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన అవసరమన్నారు. అనంతరం డైరెక్టర్ నున్న సరోజని దేవి మాట్లాడుతూ ప్రతి తల్లిదండ్రులు పిల్లలకు విలువలతో కూడిన విద్యనందించే ప్రయత్నం చేయాలన్నారు. పిల్లలు పుస్తకాలతో కంటే మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని వివరించారు. సదస్సుకు 15వేల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. తిరుమల అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు పెండ్యాల అచ్చిబాబు, ఏఎస్‌వీ సత్యనారాయణ (నాని మాస్టర్) పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

సిఫార్సు లెటర్స్ రద్దు వార్తలు అవాస్తవం

టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల

జగ్గంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): టీటీడీ దర్శనానికి టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రుల సిఫార్సు లెటర్స్ మే 1 నుంచి జూన్ 30 వరకు రద్దు అని వస్తున్న వార్తలు అవాస్తవం అని టీటీడీ బోర్డు మెంబర్, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఓ ప్రకటనలో తెలిపారు. టీటీడీ పాలకమండలి బోర్డు సిఫార్సు లెటర్స్ రద్దుపై ఎటువంటి తీర్మానం చేయలేదన్నారు. సిఫార్సు లెటర్స్ యధాతధంగా కొనసాగుతాయని నెహ్రూ పేర్కొన్నారు.

ఇంటిపై నుంచి జారి పడి బీహార్ కార్మికుడి మృతి

గొల్లప్రోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలులో జరిగిన సంఘటనలో తీవ్రంగా గాయపడిన బీహార్ కార్మికుడు చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడు. బీహార్ రాష్ట్రంలోని వెస్ట్ చంపారన్ జిల్లా రామ్‌నగర్ తాలూకా నౌరంగియా గ్రామానికి చెందిన 15మంది కార్మికులు సీజనల్ పనుల నిమిత్తం గొల్లప్రోలుకు వచ్చారు. నెలరోజులుగా పట్టణంలోని పిండి ధనరాజు వద్ద ధాన్యం ఆరబెట్టే పనుల్లో కుదిరారు. వారు ఉండేందుకు పట్టణంలో ఒక ఇంటిని సమకూర్చారు. ఈనెల 25న అర్ధరాత్రి 2గంటల సమయంలో ఘణశ్యాం మహతో(44) ఇంటిపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత పిఠాపురం, అనంతరం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. వారి మేస్త్రీ సునీల్ మహతో ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు.

పేకాడుతున్న 14 మంది అరెస్టు

కోరుకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ పోలీసులు 2 పేకాట శిబిరాలపై జరిపిన దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లు, 3 బైక్‌లు, రూ.10,200 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బుచ్చింపేట గ్రామ శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.5600 నగదు సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కోటికేశవరం గ్రామశివారులో దాడి చేసి 9 మందిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.4640 నగదును, 9 సెల్‌ఫోన్‌లు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కంచి విశ్వవిద్యాలయంలో 20 మందికి ప్రవేశాలు

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వమహా విద్యాలయంలో కాకినాడ చుట్టుపక్కల నుంచి సుమారు 20 మంది ప్రవేశం పొందినట్లుగా విద్యాలయ ప్రొఫెసర్ వెంకటరమణ తెలిపారు. స్థానిక ప్రతాప్‌నగర్ చల్లా వారి కల్యాణ మండపంలో వేద స్మార్త పండితులు ఆకెళ్ల మురళీకృష్ణ, చల్ల నిరంజన్ శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో 100 మంది విద్యార్థులు హాజరుకాగా 20మంది గ్రాడ్యుయేటు, పోస్ట్ గ్రాడ్యుయేటు కోర్సులు స్వీకరించారు.

30న చందనోత్సవం

ముమ్మిడివరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అనాతవరంలోని శ్రీభూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామివారికి ఈనెల30న అక్షయ తృతీయ సందర్భంగా చందనోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు సీతారామాంజనేయులు తెలిపారు. 30న స్వామి-అమ్మవార్లకు అభిషేకం, 30కిలోల చందనంతో అలంకరిస్తామన్నారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):అడవిపాలెంలో తాడి భవానీ ఇంటి నిర్మాణానికి సమకూర్చిన రూ.20వేల ఆర్థికసాయాన్ని తాడివారి సంక్షేమ సంఘం తరపున ఆదివారం అందజేశారు. సహాయంచేసిన తాడి శ్రీనివాస్, తాడి రత్నరాజు, తాడి సువర్ణరాజుకు అభినందనలు తెలిపారు. తాడి సత్యనారాయణ, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

రామరాజులంక సమస్యను పరిష్కరిస్తా: ఎమ్మెల్యే

మలికిపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రామరాజులంకలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలు పరిష్కరిస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆదివారం అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. ఆదివారం ప్రాథమిక పాఠశాలల వద్దనున్న వాటరు ట్యాంకును పరిశీలించారు. వాటరు ట్యాంకు కిందిభాగం శిథిలస్థితిలో ఉండడంతో గ్రామస్తులు చూపించారు. త్వరలో ఆ పనులు పూర్తి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. వర్షం వస్తే బాడవ రోడ్డు చాలా ఇబ్బందిగా ఉందని, చదువుకునే పిల్లలు చాలా ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా రామరాజులంక బాడవ రోడ్డు వెళ్లి పరిశీలించారు. గ్రామంలో మంచినీటి సమస్యలు గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా మంచినీరు, విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం పంచాయతీ భవనం వద్ద జరిగిన సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, సర్పంచ్ కాకర శ్రీనివాస్, మాజీ సొసైటీ అధ్యక్షుడు బొరుసు ఉమారావు, ముద్దల శ్రీను, దేశినీడి తాతాజీ, ఉంగరాల బాలాజీ పాల్గొన్నారు.



రామరాజులంకలో సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న రాజోలు ఎమ్మెల్యే దేవ

సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన

అంతర్వేది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అప్పనరామునిలంక గ్రామంలో సమస్యలపై అధికారులతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. పంచాయతీ భవనం వద్ద స్థానిక కూటమి నాయకులు, అధికారులతో పలు సమస్యలపై సమీక్షించారు. రోడ్లు, ఎలక్ట్రిసిటీ, తాగునీరు, ఇతర సమస్యలను ఎమ్మెల్యే దేవకు ప్రజలు వివరించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అప్పనరామునిలంక, టేకిశెట్టిపాలెం మధ్య వంతెన అప్రోచ్ రోడ్డు పనులను పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, బర్రే శ్రీను, సర్పంచ్ సుబ్బరాజు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం టౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు తెలిపారు. అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో హైస్కూలు సెంటర్ నుంచి గడియార స్తంభం సెంటర్ వరకు మృతులకు నివాళులర్పిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, రాష్ట్ర నాయకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, దంగేటి రాంబాబు, కుడుపూడి భరత్‌భూషణ్, వంటెద్దు వెంకన్నాయుడు, షేక్ అబ్దుల్‌ఖాదర్, ఉండ్రు వెంకటేష్, కేతా భానుతేజ, పొగాకు శ్రీను, పందిరి శ్రీహరి, తోరం గౌతమ్ తదితరులు పాల్గొన్నారు. సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలులో పహల్గాం మృతులకు నివాళులర్పించారు. ఉగ్రవాదులను ఏరివేయాలని డిమాండ్‌చేశారు. ఛైర్మన్ నంద్యాల నాయుడు ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. డైరెక్టర్ నంద్యాల మనువిహార్, ప్రిన్సిపాల్ దేవీదీక్షిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కోనసీమ జేఏసీ ఆధ్వర్యంలో తొలుత కన్వీనర్ బండారు రామ్మోహనరావు అధ్యక్షతన ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ సమావేశం నిర్వహించారు. ఉగ్రవాదం నిర్మూలనకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు మద్దతు ప్రకటించారు. పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశం అనంతరం గడియార స్తంభం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. మృతవీరులు అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కరాటం ప్రవీణ్, యార్లగడ్డ రవీంద్ర, ముమ్మిడి ప్రతాప్‌కుమార్ పాల్గొన్నారు.



గడియార స్తంభం సెంటర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మలను దహనంచేసి నినాదాలిస్తున్న జేఏసీ నాయకులు

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

ఐ.పోలవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 16మందిని హతమార్చడం హేయమైన చర్య అని ఆటో ఓనర్స్, వర్కర్స్ అన్నారు. గుత్తెనదీవి, జి.వేమవరం యూత్, మండ పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్, ఆటో ఓనర్స్, వర్కర్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమాలు జరిగాయి. జాతీయ జెండాలు పట్టుకుని పాకిస్తాన్ నశించాలి..ఉగ్రవాదులను అంతమొందించాలని నినాదాలు చేశారు. ఉగ్రదాడికి కేంద్రం ఘాటుగా బదులివ్వాలని నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రెళ్ళ గంగాధరం, బొక్కా లక్ష్మీనారాయణ, చోడిశెట్టి రమేష్, ఆకుల సత్తిబాబు, సలాది శ్రీనివాసరావు, కంతేటి కుమార్, వర్రే రాముడు, వాసంశెట్టి కొండయ్య, సిరంగు వీరన్న, అనిశెట్టి మణికంఠ, పోలిశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మురమళ్ళలో జరిగిన ర్యాలీలో ఆటో ఓనర్స్ వర్కర్స్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో వీధి నాగభూషణం, నక్కా రామకృష్ణ, రాయపురెడ్డి వరబాబు, వీధి చిరంజీవి, పలివెల సుబ్బారావు, రాయపురెడ్డి సురేష్, ఇళ్ళ నాగేశ్వరరావు, వీధి శేఖర్‌బాబు, మచ్చ నాగబాబు, బత్తిన పైడయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

ముమ్మిడివరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్‌లో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి కొవ్వొత్తులతో హైస్కూలు సెంటర్ వరకు నిరసన ర్యాలీ సాగించారు. ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జిదుర్గాప్రసాద్, నగర పంచాయతీ ఉద్యోగుల సంఘ నాయకుడు పెట్టా శివప్రసాద్, నిమ్మకాయల వెంకటేష్, సుతాపల్లి అజయ్‌కుమార్, నక్కా అరుణ్‌కుమార్, రమేష్, సురేష్, శివకుమార్, కాకి రాంబాబు, కేవీపీఎస్ నాయకులు యలమంచిలి బాలరాజు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట హైస్కూల్‌లో ఉపాధ్యాయుల మధ్య రచ్చ

అంబాజీపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎందరో మహానుభావులు చదివిన అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల మధ్య కులచిచ్చు రగులుతుంది. ఈపాఠశాలలో మాజీ లోక్‌సభ స్పీకర్ దివంగత జీఎంసీ బాలయోగి కూడా విద్యనభ్యసించారు. ఈపాఠశాలలో 700మందికిపైగా విద్యార్థులు, 30మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాలలో జరిగిన పీఎంశ్రీ నిధుల్లో అవకతవకలు జరిగాయని, మధ్యాహ్న భోజన పథకంలో కోడిగుడ్లు, కూరగాయలు పక్కదారి పడుతున్నాయని పాఠశాల ఉపాధ్యాయుడు అంజిబాబు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈనెల21న కొత్తపేట డీవైఈవో రామలక్ష్మణమూర్తి ఈహైస్కూల్‌లో విచారణ చేపట్టారు. ఇటీవల హెచ్‌ఎంతో పాటు మరికొంత మంది ఉపాధ్యాయులపై చేసిన ఫిర్యాదును వెనక్కితీసుకోవాలని అంజిబాబును ఒత్తిడి చేశారు. అయినప్పటికి అంజిబాబు ఫిర్యాదు వెనక్కి తీసుకోలేదు. ఈనేపథ్యంలో హెచ్‌ఎం సాయిరామ్‌తో పాటు పీఎంసీ ఛైర్మన్ పితాని త్రిమూర్తులు ఆధ్వర్యంలో కొంత అదే సామాజిక వర్గానికి చెందిన ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయుడ్ని బెదిరింపులకు గురిచేస్తున్నారనే విషయం బయటకు వచ్చింది. దీంతో ఈనెల25న కాపు సామాజిక వర్గీయులు, ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కొందరు నేతలు పాఠశాలలో జరుగుతున్న విషయాలపై నిలదీశారు. పీఎంశ్రీపై అవతవకలు జరిగితే విచారణకు ఒప్పుకోవాలని, అంతేకాని పాఠశాల ప్రతిష్టను బయటపెట్టవద్దని హెచ్చరించారు. పాఠశాలలో కుల రాజకీయాలు చేయవద్దని ఇద్దరు ఉపాధ్యాయులను గ్రామస్తులు హెచ్చరించారు. ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల ప్రతిష్టను దిగజారకుండా ఉపాధ్యాయుల మధ్య సమన్వయం ఉండేలా చూడాలనికోరుతున్నారు.

ప్రశాంతంగా అసిస్టెంట్ రాత పరీక్ష

- 1,358మంది అభ్యర్థులు హాజరు

యానాం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): యానాంలో ఆదివారం నిర్వహించిన అసిస్టెంట్ టైర్ వన్ రాతపరీక్ష ప్రశాంతంగా జరిగిందని పరిపాలనాధికారి మునిస్వామి తెలిపారు. యానాంలో ఏర్పాటుచేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో 1359మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాలను అధికారులతో కలిసి ఆయన తనిఖీ చేశారు. కట్టుదిట్టమైన ఏర్పాట్లతో పరీక్షా జవాబు పత్రాలను పుదుచ్చేరి తరలించారు. మూడు రోజుల్లో ఫలితాలు వెలువడనున్నాయి. ఈ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా త్వరలో జరిగే టైర్ టూ రాత పరీక్షకు అర్హత పొందుతారు.

నాగబాబుకు మూడు అవార్డుల ప్రదానం

అంబాజీపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ముక్కామలకు చెందిన కళాకారుడు పసుపులేటి నాగబాబు విజయవాడ గాంధీనగర్‌లో ఉన్న హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో మూడు అవార్డులు అందుకున్నారు. విశాఖపట్నం అల్లిపురానికి చెందిన మదర్‌థెరిస్సా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ గురుబ్రహ్మ సేవా రత్న అవార్డు, గ్లోబల్ ఫౌండేషన్ సంస్థ కళాజ్యోతి బిరుదును, ప్రతిభ సాంస్కృతిక క్రీడా స్వచ్ఛంద సేవా సంస్థ ఆణిముత్యం ఉగాది జీవిత సాఫల్యపురస్కారాలనుఅందుకున్నారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో విద్యుత్ సరఫరాలో మూడు రోజులు అంతరాయం ఉంటుందని రాజోలు ట్రాన్స్‌కో ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫర్ స్థానంలో కొత్త 8ఎంవీఏ పవన్ ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణలో భాగంగా ఈనెల 28, 29, 30 తేదీల్లో రాజోలు, తాటిపాక, శివకోడు, కడలి, వేగివారిపాలెం, గెద్దాడ, పొదలాడ, సోంపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడు అరెస్టు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఎస్ఐ పి.బాలాజీ ఆధ్వర్యంలో ఆదివారం అమలాపురం మండలంలో విస్తృతంగా దాడులు నిర్వహించారు. గున్నేపల్లి అగ్రహారంలో పరిమితికి మించి మద్యం సీసాలు కలిగి ఉన్న కేతా సాయిబాబును అరెస్టుచేశారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసునమోదుచేసినట్టు ఎక్సైజ్ సీఐ తెలిపారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అయినవిల్లిలంకలో పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అయినవిల్లి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఆదివారం అయినవిల్లిలంక గ్రామంలో జరిగిన అంబేడ్కర్ జయంత్యుత్సవంలో ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే గిడ్డి మాట్లాడుతూ రాజ్యాంగం వలన అణగారిన వర్గాలకు మేలు జరిగిందన్నారు. అనంతరం పేద, వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, జై భీమ్ యూత్, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి వేడుకలు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నడిపూడి నక్కావారిపేటలో జైభీమ్ యూత్, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆదివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ బడుగు సత్యనారాయణ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి శ్రీనివాసరావు, నక్కా రామారావు, నక్కా మోహనరావు, మెండి కమలాకర్, నక్కా వెంకట్రావు, కుంచే ధనుంజయరావు, దేవరపల్లి సురేష్, నక్కా సందీప్, బూల బాలాజీ పాల్గొన్నారు.

అందరివాడు అంబేడ్కర్

పి.గన్నవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడని అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్ కొనియాడారు. అంబేడ్కర్ జయంత్యుత్సవాలు పురస్కరించుకుని ఉడిమూడిలో దళిత యువసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధన కోసం యువత పయనించాలన్నారు. అనంతరం అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. అలాగే స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్, టీడీపీ టీఎన్ ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు, గ్రామంలోని దళిత నాయకులు, దళిత యువసేన సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభానికి అన్న క్యాంటీన్ సిద్ధం



అమలాపురం మున్సిపల్ కార్యాలయం వెనుక నిర్మించిన అన్నక్యాంటీన్

అమలాపురం టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పేదలకు అతి తక్కువ ధరకే అల్పాహారం, భోజనాలు అందించేందుకు అమలాపురం మున్సిపల్ కార్యాలయం వెనుక కూరగాయల మార్కెట్ రోడ్డు వైపు అధునాతనంగా అన్నక్యాంటీను భవనాన్ని నిర్మించారు. అన్నక్యాంటీను పథకాన్ని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన సమయంలోనే స్థానిక సర్క్యులర్ బజార్ వెనుకభాగంలో అన్న క్యాంటీను నిర్మాణానికి ఏర్పాట్లు చేశారు. కొంతమేర పనులు జరిగి నిలిచిపోయాయి. ఆ తరువాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్నక్యాంటీను నిర్మాణ పనులు పూర్తిగా మరుగున పడిపోయాయి. తిరిగి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే అన్నక్యాంటీన్లను తిరిగి ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టి అమలు చేసింది. దీనిలో భాగంగా అమలాపురంలో అన్న క్యాంటీను నిర్మాణానికి రూ.50లక్షలు కేటాయించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తిచేసుకుని ఆ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇటీవల అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నక్యాంటీన్‌ను పరిశీలించి త్వరలోనే ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. అన్నక్యాంటీన్ ఎప్పుడెప్పుడు ప్రారంభమవుతుందా అని పట్టణంలోని పలు షాపింగ్ మాల్స్, వ్యాపార సంస్థల్లో పనిచేస్తున్నవారు, కూలీలు, ఇలా ఎందరో పేదలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సిల్టు తీసి ఎన్నేళ్లయ్యిందో..

అన్నక్యాంటీను భవనానికి ఎదురుగా ఓ మేజర్ డ్రైన్ ఉంది. దీనిలో పురపాలక సంఘం తరపున సిల్టు తొలగించి ఎన్నేళ్లయిందో అన్నట్టుగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలతో నిండిపోయింది. మురుగునీరు ముందుకుపారే దారిలేక ఎక్కడికక్కడే చెత్త నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దానికితోడు దోమలకు ఆవాసంగా మారిపోవడంతో మార్కెట్ ఏరియాతో పాటు సమీప ప్రాంతాలకు చెందినవారు దోమల మోతతో కంటిమీద కునుకు లేకుండా జాగారం చేయాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా డ్రైనేజీలో సిల్టు తొలగించడంతో పాటు మురుగునీరు ముందుకు పారేలా చర్యలు చేపట్టి దుర్వాసన, దోమల బెడద నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉచిత విద్య ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి 2025-26 సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులు 1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు మండల విద్యాశాఖాధికారులు గుబ్బల సూర్యప్రకాశం, సరెళ్ల దుర్గాదేవిలు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం సీట్లను పేద విద్యార్థులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. మండల, పట్టణ పరిధిలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు ఇప్పటికే తమ వివరాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకున్నారన్నారు.

నేడు మహిళా కమిషన్ ముందుకు భవానీ కేసు



కాట్రేనికోన, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చల్లపల్లి పంచాయతీ కార్యదర్శి రొడ్డా భవాని ఆత్మహత్య కేసు జాతీయ మహిళా కమిషన్‌కు చేరింది. ఉప్పలగుప్తం మండలం చల్లపల్లి పంచాయతీ కార్యదర్శిగా ఉన్న రొడ్డా భవాని 2022 జూలై 7న ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఉప్పలగుప్తం ఎంపీపీ భర్త, వైసీపీ నాయకుడు దంగేటి రాంబాబు వేధింపులే భవానీ ఆత్మహత్యకు కారణమని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. నెలల తరబడి ఉద్యమాలు జరిగాయి. అయితే ఈకేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న రాంబాబును అప్పటి ప్రభుత్వం అండతో పోలీసులు తప్పించారని భవానీ న్యాయపోరాట సమితి కన్వీనర్ బొంతు రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అయితే బాధితుల తరపున జాతీయ మహిళా కమిషన్‌ను ఆశ్రయించారు. ఈనెల28న హైదరాబాదులో జాతీయ మహిళా కమిషన్ ముందు హాజరై వాస్తవాలను వివరించనున్నట్టు రమణ తెలిపారు.

మే డే నాడు భారీ బహిరంగ సభ

కాట్రేనికోన, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల సీఐటీయూ, ప్రజాసంఘాల సమావేశం ఆదివారం విప్పర్తి మోహనరావు అధ్యక్షతన కాట్రేనికోనలో జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మే డే రోజున భారీ బహిరంగ సభ నిర్వహించాలని సూచించారు. మే 20న కార్మిక సంఘాల పిలుపు మేరకు సమ్మెను జయప్రదం చెయ్యాలని కోరారు. సమ్మె ఆవశ్యకతను తెలిపే బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను అమలుచేయాలి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల భద్రతకు సంబంధించిన 1/2019 సర్క్యులర్‌ను ఖచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అమలాపురం ఆర్టీసీ డిపో ఎదుట నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం నాటికి 63వ రోజుకు చేరుకున్నాయి. డ్రైవర్ బీఎస్ నారాయణకు అమలాపురం డిపోలో పోస్టింగ్ ఇవ్వాలని, సిక్ జీతాలు చెల్లించాలని నినాదాలు చేశారు. కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి గేట్ మీటింగ్ నిర్వహించారు. రాష్ట్ర సంఘ కోశాధికారి పీవీవీ మోహన్, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌నాయుడులు దీక్షలకు సంఘీభావం తెలిపారు. జిల్లా కార్యదర్శి పందిరి రాంబాబు ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ నిర్వహించగా పలువురు కార్మికులు రిలే దీక్షల్లో పాల్గొన్నారు. యూనియన్ డిపో కమిటీ అధ్యక్షుడు ఎండీ ఔలియా, పితాని మణిరాజు, గౌరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో మెడ్ యునైటెడ్ సహకారంతో అమలాపురం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి వైశ్యసంఘ కల్యాణ మండపంలో సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ యెండూరి రాఘవకుమారి తెలిపారు. ఈశిబిరంలో రూ.5వేలు విలువైన కేన్సర్, గ్యాస్ట్రో, రక్త, కళ్లే పరీక్షలను వారి అవసరాలకు అనుగుణంగా ఉచితంగా చేస్తామన్నారు. ముందుగా తమ పేర్లను బచ్చు పార్వతీదేవి, సెల్ 9291256729, అప్పన వీరన్న సెల్ 9290084360కు ఫోన్‌చేసి నమోదు చేయించుకోవాలన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ

అంతర్వేది, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెంలో టీడీపీ మండలాధ్యక్షుడు ముప్పర్తి నాని ఆదివారం బూత్ కమిటీ కన్వీనర్లకు సభ్యత్వ కార్డులను అందించారు. పార్టీ బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి యెనుముల వెంకటరమణ, గ్రామశాఖ అధ్యక్షుడు బెల్లంకొండ సత్యనారాయణ, నీటిసంఘం అధ్యక్షుడు యెనుముల సింహాచలం(బుజ్జి), టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా క్రికెట్ పోటీలు

మామిడికుదురు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలోని ఓఎన్జీసీ గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఉల్లాసంగా జరుగుతున్నాయి. గ్రామదేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ జాతరలు పురస్కరించుకుని ఏర్పాటుచేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో పెదపట్నంలంక, బి.దొడ్డవరం, అప్పనపల్లి, నగరం గ్రామానికి చెందిన క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. ఆదివారంతో పోటీలు ముగిసినట్టు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.10వేలు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.


పెన్షన్లకు కటాఫ్ తేదీని తొలగించాలి

మామిడికుదురు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పెన్షన్లపై కటాఫ్ తేదీని తొలగించాలని రాజోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు ఈలి శ్రీనివాస్ కోరారు. మామిడికుదురులో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పెన్షన్ పొందుతున్న భర్తను కోల్పోయిన భార్యలకు ఆ పెన్షన్‌ను పునరుద్ధరించడం అభినందనీయమన్నారు. కటాఫ్ తేదీ వల్ల అర్హత కలిగినవారు ఎంతో మంది పెన్షన్ కోల్పోతారన్నారు. దివ్యాంగులు, వితంతువులకు పెన్షన్ ఇచ్చే ప్రక్రియ నిరంతరం సాగాలని సూచించారు.

డీఎస్సీలో టెక్నికల్ పోస్టులు ప్రకటించాలి

కాట్రేనికోన, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో టెక్నికల్ పోస్టులు ప్రకటించి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కాట్రేనికోనకు చెందిన విశ్రాంత డ్రాయింగ్ టీచర్ కొప్పిశెట్టి ఆనందరావు ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యా శాఖా మంత్రి లోకేష్‌లను కోరారు. వృత్తి విద్యా కళాకారుల అవసరాన్ని గుర్తించి గతంలో ప్రతి ఉన్నత పాఠశాలకు డ్రిల్, డ్రాయింగ్, క్రాఫ్ట్, సంగీతం, నృత్య విభాగాలకు టీచర్లను నియమించేవారన్నారు. ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ ప్రకటించిన చంద్రబాబును నిరుద్యోగులందరూ ఎంతగానో ఆరాధిస్తున్నారని ఆయన అన్నారు. ఇప్పటికీ ఎంతోమంది టెక్నికల్ టీచర్లు నిరుద్యోగులుగా ఉన్నారని, వారికి కూడా న్యాయం చేసి, వారి కుటుంబాలకు సహకరించడంతో పాటు విద్యార్థులకు వృత్తి విద్యలు నేర్చుకునే అవకాశం కల్పించాలని ఆయన అభ్యర్థించారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు



ముమ్మిడివరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా టీనేజ్ న్యాయవాది వడ్డి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా గోనమండ వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా మట్టపర్తి వెంకటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ముడే వెంకట్రావు, కోశాధికారి తిల్లపూడి అర్జునరావు, లైబ్రేరియన్‌గా గంటి శ్రీధర్‌బాబు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కాశి సింహాద్రివర్మ, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా రామాయణం మనేశ్వరరావు వ్యవహరించారు. వడ్డి నాగేశ్వరరావును న్యాయవాదులు బీర ప్రసాద్, కాశి సిద్ధార్థకుమార్, దోనిపాటి ఆంజనేయులు, ఎండీ ప్రసాద్, తిరుకోటి శాంతిసుధ, అయినవిల్లి వలీబాబా, కేఎల్‌వీ ప్రసాద్, కోన వెంకటశ్రీనివాసరావు, అలీహసన్, కాశి సింహాద్రివర్మ, మాలమహానాడు నాయకుడు దేవరపల్లి ఏడుకొండలు, రిపబ్లికన్ పార్టీ నాయకులు చీకురుమెల్లి శ్రీనివాస్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఉదయభాస్కరవర్మ అభినందనలు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సబ్బతి ఫణీశ్వరరావు పేర్కొన్నారు. తెలుగునాడు ట్రేడ్‌యూనియన్ సమావేశం జిల్లాస్థాయిలో సోమవారం అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించారు. టీఎన్‌టీయూసీ జిల్లా శాఖ అధ్యక్షుడు కుసుమ సూర్యమోహనరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో తొలుత మేడే కార్మిక దినోత్సవంపై సమీక్షించారు. కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు తీర్మానించారు. రాష్ట్ర అధికార ప్రతినిధి బండారు సూర్యనారాయణమూర్తి, పార్లమెంటు అధికార ప్రతినిధి కాశిన జయనాథ్, నియోజకవర్గ అధ్యక్షుడు వలవల శివరావు, ఉపాధ్యక్షులు పట్నాల రమణ, బూసి సోమన్న పాల్గొన్నారు.

వాకర్స్ క్లబ్ సమావేశం

పి.గన్నవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో మండల వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తోలేటి సుబ్బారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. దంత వైద్యుడు నాగాబత్తుల అశోక్ ముఖ్యఅతిథిగా పాల్గొని పళ్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు ఎస్.లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శి కడలి సారధి, నేలపూడి రామకృష్ణ, కడలి సత్యనారాయణ, పాబోలు సత్యనారాయణమూర్తి, నరసింహం, ఎస్.రామకృష్ణ, కె.సత్యనారాయణ, ఎస్.నాగేశ్వరరావు, రాఘూరి సత్యనారాయణమూర్తి, కె.సత్య నారాయణ, పి.పరశురాముడు, వి.అనంతలక్ష్మి, కె.గీతాదేవికుమారి పాల్గొన్నారు.

నేడు మురుగులమ్మతల్లి జాతర



మురుగులమ్మతల్లిని దర్శించుకున్న ఎమ్మెల్యే ఆనందరావు తదితరులు

అమలాపురం రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): బండారులంక గ్రామదేవత శ్రీగంగాదేవి మురుగులమ్మతల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు పక్షం రోజులుగా నిర్వహిస్తున్నారు. వివిధ సామాజికవర్గాలు, వృత్తుల వారీగా అమ్మవారికి ప్రతీరోజు సేవ నిర్వహించారు. ఆదివారం అమ్మవారిని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, వాసురాజు తదితరులు దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. దేవాంగ జాగరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అమ్మవారి జాతర అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. ఈనెల29న అమ్మవారి ఆలయం వద్ద తీర్థం జరుగుతుంది. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ చింతా శంకరమూర్తి, బళ్ల వెంకటేశ్వరరావు, ఏకుల విజయ్, బళ్ల శ్రీనివాసచక్రవర్తి, వాసంశెట్టి రాధ, కాశిన చినబాబు, బుట్టే ఉమానందికేశ్వరదైవజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం

మామిడికుదురు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదివి 586 మార్కులు సాధించిన కొల్లాబత్తుల మహాలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘ సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. అలాగే అంబేడ్కర్ చిత్రపటాన్ని అందించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ మండలశాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కారుపల్లి కల్యాణ్‌బాబు, గౌరవాధ్యక్షుడు పెయ్యల వీరభద్రరావు, నాయకులు బత్తుల రమేష్‌బాబు, భయ్యా మోహన్, నేల శ్రీనివాస్, టీఆర్కే గణపతిరావు, ఉండ్రు శ్రీరమణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఉప్పలగుప్తం, భీమనపల్లి శాఖా గ్రంథాలయాల్లో ఈనెల28 నుంచి జూన్ 6వరకు వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నట్టు గ్రంథాలయాధికారులు నిమ్మకాయల శేషుకుమార్, సలాది నాగేశ్వరరావు ఆదివారం విలేకర్లకు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరిగే కార్యక్రమంలో పుస్తక సమీక్ష, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, కథలు చెప్పడం తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందన్నారు.విద్యార్థులు శిక్షణా తరగతులకు హాజరయ్యేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహకరించాలన్నారు.శిబిరాలకు హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం, బహుమతులు అందజేసే దాతలు వివరాలు తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో పాల్గొనదలచిన విశ్రాంతఉపాధ్యాయులు, కవులు, పండితులు, ఉద్యోగులు, మేధావులు అంగీకారాన్ని 9989817936, 9866847246 నెంబర్లకు ఫోన్ చేసి చెప్పాలన్నారు.

పళ్లాలమ్మకు ప్రత్యేక పూజలు

మామిడికుదురు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లూటుకుర్రు గ్రామం బోనం మెరకలో వేంచేసి ఉన్న పళ్లాలమ్మ అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం మహిళలు సామూహిక అష్టోత్తర శత కలశ పూజ, సామూహిక కుంకుమార్చన, వివిధ రకాల పుష్పాలు, ఫలాలతో అర్చనలు, లక్ష గులాబీలతో పుష్పార్చన విశేష మహానివేదన తదితర పూజా కార్యక్రమాలను వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈదరాడ గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ పూజ్యం జగన్నాథశర్మ బ్రహ్మత్వంతో గణపతి, మహాకాళీ, లక్ష్మీసరస్వతి హోమాలు, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పం, పండిత సత్కారం తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆయా పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీతారాములకు వెండి, బంగారు వస్తువుల బహూకరణ

అంబాజీపేట, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): పుల్లేటికుర్రు శివారు గొల్లగుంట కొప్పిశెట్టివారిపాలెంలో ఉన్న శ్రీకోదండరామస్వామికి వెండి కిరీటాన్ని, వెండి నేత్రాలు, నామాలు, బంగారు ముక్కుపుడక స్థానికులు అందించారు. ఆ వస్తువులకు సంప్రోక్షణ చేసి స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.

తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ గ్రేడింగ్ సర్టిఫికెట్లు

అంబాజీపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానికజడ్పీ హైస్కూల్‌లో తైక్వాండో బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ సర్టిఫికెట్లను జనసేన నాయకులు కొర్లపాటి గోపి అందచేశారు. మే1నుంచి 31వరకు ఉచిత సమ్మర్ తైక్వాండో కోచింగ్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సాయిరాం, కొర్లపాటి వెంకటేశ్వరరావు, కోచ్‌లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యానాం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుడు మృతి చెందాడు. కాకినాడ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఈనెల23న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా పనులు చేయడానికి కనకాలపేటకు చెందిన కాలా సుబ్రహ్మణ్యం విద్యుత్ స్తంభం ఎక్కి ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టుకోగానే విద్యుత్‌ఘాతానికి గురై తీవ్రంగాగాయపడ్డాడు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతడు ఆదివారం మృతిచెందాడు.

అనారోగ్యానికి గురైన కుటుంబానికి సాయం

ముమ్మిడివరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): లంకాఫ్ ఠాణేలంకకు చెందిన గుబ్బల రామసత్యనారాయణ-ఉదయలక్ష్మి దంపతులు టీబీ వ్యాధితో బాధపడుతున్నారు. ఎ.వేమవరం నామాలవారిపాలేనికి చెందిన ముషిణి రాంబాబు నిత్యావసరాలు, బియ్యం, కిరాణా, కూరగాయలు, కోడిగుడ్లు సమకూర్చారు. వీటిని సాయిసంజీవని మహిళా నడక యోగా ఆరోగ్య సేవా సంస్థ అధ్యక్షురాలు జల్లి సుజాత ఆధ్వర్యంలో అందజేశారు. నాలుగు నెలలుగా ఆ కుటుంబానికి సుజాత నిత్యావసరాలు అందిస్తున్నారు. ఏడాది పాటు ఆ కుటుంబాన్ని ఆదుకోనున్నట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గుర్రాల అమల, కన్నెపాముల వెంకటేశ్వరరావు, శ్రీదేవి, గొల్లపల్లి గోపి, సత్యనారాయణ పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



చింతలూరు నూకాంబిక అమ్మవారికి వెండి ఆభరణాలు అందజేస్తున్న భక్తులు

నూకాంబిక అమ్మవారికి వెండి ఆభరణాల అందజేత

ఆలమూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారికి రూ.4.5 లక్షల విలువైన వెండి ఆభరణాలను ఆదివారం భక్తులు బహూకరించారు. నాలుగున్నర కిలోల వెండితో మండపేటకు చెందిన శిల్పి వాసా శ్రీనివాస్ చేసిన అమ్మవారి కుడి చేతి కవచం, పిడికిడి ఆభరణాలకు పూజలు జరిపి అమ్మవారికి అలంకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజు చౌదరికి మహిళా భక్తులు వాటిని అందించారు. కార్యక్రమంలో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావు, మాజీ చైర్మన్లు అల్లంరాజు రామకృష్ణమూర్తి, వైట్ల శేషుబాబు, ఎ.శివన్నారాయణ, దాసరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేల విరాళం: అమ్మవారి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల నిమిత్తం మురమళ్ల గ్రామానికి చెందిన నల్లమాటి త్రినాథరావు, శ్రీలత దంపతులు రూ.50,116 విరాళాన్ని ఆలయ ఈవోకి అందించారు. దాతల సహకారంతో నిర్మితమవుతున్న రాజగోపురాలు, ఇతర అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో ఆయా పనులకు వాటిని ఉపయోగించాలని దాతలు కోరారు.



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.3.98 లక్షలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.3,98,162 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

నియోజకవర్గంలో ప్రతి శని, ఆదివారాల్లో జాబ్‌మేళా

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన వారికి మంత్రి సుభాష్ ఆదివారం నియామక పత్రాలు అందచేశారు. అమర్ రాజా, హీరో మోటో కార్ప్, లక్ష్‌షేర్ సంస్థలకు పలువురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన ఉద్యోగులు చిత్తూరు, తడ, శ్రీసిటీ, తమిళనాడులో పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఇక నుంచి నియోజక వర్గంలో ప్రతి శని, ఆదివారం పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటీఐ, డిప్లొమో, బి.టెక్, నర్సింగ్ వంటి విద్యార్హతల వారికి ఫార్మా, సాఫ్ట్‌వేర్, బ్యాంకింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ కంపెనీలను తీసుకువచ్చి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అమర్‌రాజా హెచ్ఆర్ కల్యాణ్, హీరో మోటార్ కార్ప్ హెచ్ఆర్ సురేష్, ఉపాధి డైరెక్టర్ రాజ్‌కుమార్, సీఈవో అనిల్ ఉండు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి అమ్మవారి జాతర

ఆత్రేయపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ర్యాలి వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారు (వాకులమ్మ) తీర్థం, జాతర ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ దేవతకు పలువురు గ్రామ స్తులు, భక్తులు నైవేద్యాలను సమర్పించారు. వేలాది మంది భక్తులు అమ్మ వారిని దర్శించుకుని మొక్కులు చెల్లిం చారు. సాయంత్రం పోతురాజు సిరిబొమ్మ ఉత్సవాన్ని అశేష భక్తజనం మధ్య ఘనంగా జరిపారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వాటి ఏర్పాట్లు నిర్వహించారు.



సిరుబొమ్మ ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

ఆత్రేయపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ ఆదివారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. లొల్లకాలువ రేవు వద్ద నుంచి గ్రామం మీదుగా వాడపల్లి వెంకన్న ఆలయం ఎదురుగా ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా వారు నినాదాలు చేశారు. కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించి ఉగ్రదాడుల్లో మరణించిన వారికి శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ఉచిత వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): చొప్పెల్లలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో పీఎంపీల అసోసియేషన్, రాజమహేంద్రవరం సుభద్ర ఆసుపత్రుల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచ్ దంగేటి చంద్రకళ ప్రారంభించారు. ఆసుపత్రి వైద్యులు ఎ. దుర్గాప్రసాద్, పద్మినిలు సుమారు 300 మందికి పలు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలమూరు డీసీ అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, పీఎంపీల అసోసియేషన్ నాయకులు ఏడిద లక్ష్మణాచార్యులు, కోన సత్యనారాయణ, స్థానిక నాయకులు బళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యానందరావు

రావులపాలెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం జడ్పీ పాఠశాలలో నిర్వహించిన సౌర విద్యుత్ వినియోగ శిక్షణ తరగతుల ముగింపులో వారు పాల్గొని శిక్షణ పూర్తి చేసుకున్న యువతకు శిక్షణ ధ్రువపత్రాలు, ఉద్యోగ నియామక పత్రాలను అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వివిధ పథకాల ద్వారా యువతకు అన్ని రంగాలలో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. ప్రధాన మంత్రి సూర్యఘర్ మఫ్త్ బీజిలి యోజన స్కిల్ ఇండియా సౌజన్యంతో నిర్వహించిన ఈ శిక్షణ తరగతులలో ఉద్యోగ అవకాశాలు కూడా లభించాయన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి, గుత్తుల పట్టాభిరామారావు, చిలువూరి సతీష్‌రాజు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ బీమా అందజేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వి.సావరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా టీడీపీ సభ్యత్వ బీమా రూ. 5లక్షలను ఆదివారం రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేతుల మీదుగా అందజేశారు. గ్రామానికి చెందిన వెలుబుడి రమణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుడు కుటుంబానికి టీడీపీ సభ్యత్వ బీమా కింద ఐదు లక్షలు మంజూరుకాగా, వి.సావరంలో మృతుడు స్వగృహానికి వెళ్లి బీమా సొమ్మును మృతుడు భార్య రమణమ్మకు అందజేశారు. ఈసందర్భంగా రమణమ్మ మాట్లాడుతూ తమకు బీమా అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, ఎమ్మెల్యే వేగుళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట పిల్లి గణేష్, గుత్తుల శ్రీనివాస్, అల్లూరి రామకృష్ణచౌదరి, కొవ్వూరి భాస్కరరెడ్డి, వెలగల వీర్రెడ్డి తదితరులు ఉన్నారు.



బీమా సొమ్మును అందజేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కూటమి ప్రభుత్వంలో

మత్స్యకారులకు మహర్దశ

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మత్స్యకారులకు మహర్దశ పట్టిందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం మంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో 129178 మత్స్యకార కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రభుత్వ చర్యల కారణంగా మత్స్యకారలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారింది

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల దశ మారిందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థికసాయం రెట్టింపు చేయడం ఎంతో మేలు చేకూరిందన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి టీడీపీ ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. వైసీపీ పాలనలో ఫిష్ ఆంధ్ర పేరుతో చేపట్టిన పథకాల వల్ల ఒక్క మత్స్యకార కుటుంబానికి కూడా మేలు జరగలేదన్నారు. గతంలో కూడా టీడీపీ ప్రభుత్వమే మత్స్యకార భృతి ప్రవేశపెట్టిందని ఆయన గుర్తు చేశారు.

మండపేట విద్యార్థికి గిన్నిస్ వరల్డ్‌లో చోటు

మండపేట, ఏప్రిల్, 27(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటకు చెందిన వీరిన సంజయ్ కుమార్ వరల్డ్‌లో చోటు దక్కించుకున్నారు. గత ఏడాది డిసెంబరు 1న 18 దేశాలకు చెందిన 1046 మంది చిన్నారులు ఆలపించిన స్వరాలు ఆలపించి గిన్నిస్‌బుక్ రికార్డును సొంతం చేసుకున్నారు. దీనికి సంబంధించిన సంస్థ విద్యార్థికి ధృవీకరణ పత్రం, గోల్డ్‌మెడల్‌లను అందించింది. గిన్నిస్ రికార్డును సాధించిన విద్యార్థిని దర్మవీర్‌పాల్ తదితరులు అభినందించారు.

కాంగ్రెస్‌నేత హత్య అమానుషం

కామన ప్రభాకరరావు

మండపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతలు క్షీణించాయని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు ఆరోపించారు. కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చిప్పగిరి లక్ష్మీనారాయణను దారుణంగా హత్య చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ హత్యకు పాల్పడిన వారిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



భీమేశ్వరాలయంలో పండితుల ఆశీర్వచనం పొందుతున్న కృష్ణా కలెక్టర్ దంపతులు

భీమేశ్వరుని సన్నిధిలో కృష్ణా కలెక్టర్

ద్రాక్షారామ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని ఆదివారం కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ సతీ సమేతంగా దర్శించుకున్నారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు.



మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

పోస్టల్ ఉద్యోగులపై టార్గెట్‌లు సరికాదు

మండపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పోస్టల్ ఉద్యోగులపై టార్గెట్‌లను పెట్టి ఇబ్బందులకు గురిచేసే తీరును పోస్టల్ ఉద్యోగులు తప్పుపట్టారు. మండపేటలో ఆదివారం సూర్య కన్వెన్షన్ హాల్లో తపాల ఉద్యోగుల సమావేశం జరిగింది. దీనికి ఆల్ ఇండియా తపాల గ్రామీణ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. సమావేశానికి అడహక్ కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో స్థానిక పోస్టల్ ఉద్యోగ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి



ఆత్రేయపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి నెం.1 ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేగేశ్న సత్యనారాయణ రాజు(52) ఆదివారం ఉదయం ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఈయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఈయన మృతిపై యూటీఎఫ్ మండల శాఖ, మండల విద్యాశాఖాధికారులు సానుభూతి తెలిపారు. ఈయన పవన్‌కల్యాణ్ వీరాభిమాని. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్‌లలో సర్వీస్ చేసేవారు. రీల్స్ చేస్తూ అలరించేవారు. ఈయన మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వి.సావరంలో పేకాడుతున్న ముగ్గురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు రాయవరం ఎస్‌ఐ డి.సురేష్ బాబు తెలిపారు. ఆదివారం ఎస్‌ఐ మాట్లాడుతూ పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1390 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



ఆత్రేయపురం మండలం పేరవరంలో తాగునీటి పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీ. పక్క చిత్రంలో వృథాగా పోతున్న తాగునీరు

పగిలిన పైపులైన్..తాగునీరు వృథా

అధికారుల ఉదాశీనతపై స్థానికుల అసంతృప్తి

ఆత్రేయపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం పేరవరం వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో వారం రోజుల నుంచి పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా రోడ్డుపాలవుతోంది. ఇటీవల మండుతున్న ఎండలకుతోడు గుక్కెడు నీటి కోసం ఎంతో మంది ఇబ్బందులు పడుతుంటే ఇక్కడ మాత్రం కొన్ని రోజుల మంచినీరు రోడ్డుపాలవుతోంది. ఈ విషయంలో అధికారులు చోద్యం చూస్తున్నారని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బొబ్బర్లంక వద్ద తాగునీరు అందించే పథకానికి సంబంధించి అప్పట్లో చేపట్టిన పైపులైన్ల నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో తాగునీటి ఇబ్బందులు తరచూ ఏర్పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఎప్పుడో వేసిన తాగునీటి పైపులు పగిలిపోవడంతో పలుచోట్ల మంచినీరు కలుషితమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. శివారు ప్రాంతాల్లో తాగునీరు అందని పరిస్థితి ఏర్పడుతుండగా పైపులీకేజీతో నీరు వృథాగా పోతోంది. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోవడం లేదంటూ కూటమి శ్రేణులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. మంచినీరు రోడ్డుపాలు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గొల్లాలమ్మకు మంత్రి సుభాష్ పూజలు



గొల్లాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆముజూరు గ్రామ దేవత గొల్లాలమ్మ జాతరను శనివారం రాత్రి ఘనంగా జరిపారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని అందంగా అలంకరించారు. రెండు రోజులుగా గ్రామంలో పలు కార్యక్రమాలను గ్రామస్తులు వైభవంగా నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా శనివారం రాత్రి గరగనృత్యాలు, బుట్టబొమ్మలు, గారడీ, కేరళ వాయిద్యాలు, బ్యాండు మేళాలు, ఆర్కెస్ట్రా వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం జరిగిన తీర్థంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సర్పంచ్ నానావరపు కల్యాణి, ఉప సర్పంచ్ ఈదల శ్రీనివాస్ చౌదరి, కూటమి నాయకులు, టీడీపీ మండల అధ్యక్షుడు మరివాడ చిన్నికృష్ణ, కూళ్ల నీటి సంఘం అధ్యక్షుడు ఎనుముల గోపాలకృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

హైటెక్ ఇనిస్టిట్యూట్‌ను పరిశీలించిన ప్రజా ప్రతినిధులు



మాట్లాడుతున్న మంత్రి సుభాష్, ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): గోపాలపురం జాతీయ రహదారి చెంతన ఉన్న హైటెక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ టెస్టింగ్ సెంటర్‌ను ఆదివారం మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ హైటెక్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ట్రైనింగ్ టెస్టింగ్ సెంటర్ నిర్వాహకుడు గుత్తుల సూర్యనారాయణ కుమార్ ఆధ్వర్యంలో 2008 నుంచి ఇనిస్టిట్యూట్ ద్వారా శిక్షణ అందించి ఇతర దేశాలకు పంపించడం అభినందనీయమన్నారు. ఇనిస్టిట్యూట్‌ను సందర్శించాలని సూర్యనారాయణ కుమార్, యువ నాయకుడు బండారు సంజీవ్‌ల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే బండారు, టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణతో కలిసి పరిశీలించామన్నారు. ఇక్కడ శిక్షణ ఇచ్చే తీరును తెలుసుకున్నారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధి, సంక్షేమాన్ని ముందుకు నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం సీఎం చంద్రబాబు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళుతున్నారన్నారు.

ఓ కలం జ్ఞాపకం వ్యాస సంపుటి ఆవిష్కరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కథా రచయిత భమిడిపాటి గౌరీశంకర్ రచించిన ఓకలం జ్ఞాపకం వ్యాస సంపుటిని ఆదివారం రామచంద్రపురంలో ఆవిష్కరించారు. స్థానిక హౌసింగ్ బోర్డులో వారణాసి సత్తిబాబు గృహంలో జరిగిన ఆవిష్కరణ సభలో పాల్గొన్న వీఎస్ఎం కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర్ ర్యాలి శ్రీనివాస్ మాట్లాడుతూ 19, 20వ శతాబ్దాల కాలంనాటి రచయితల రచనలలో విశేషాలను ఈ వ్యాస సంపుటిలో తెలియచేశారన్నారు. రచయిత భమిడిపాటి గౌరీశంకర్ మాట్లాడుతూ అనేక పుస్తకాల్లో వచ్చిన వ్యాసాలను ఒక పుస్తకంగా తీసుకువచ్చే అవకాశం కలిగిందని ఇప్పటి వరకు 12 పుస్తకాలు రచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయని వారణాశి శోభావళి, వారణాసి సత్తిబాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో 15 మంది కవులు కవితాగానం చేశారు. కార్యక్రమంలో చాగంటి సుబ్రహ్మణ్యం, గరగ రామకృష్ణ, ఎంవీవీఎస్ గోపాలకృష్ణ, బండకవి రామారావు, డి.టి హేమంత్ సింగ్, డాక్టర్ పి.నాగమల్లిక, నాగుల భవానీ, బుగత యమున, ఎంకె లక్ష్మీ, భూపతి సుమశ్రీ, కల్లూరి రాజు తదితర కవులు పాల్గొన్నారు.



వ్యాస సంపుటిని ఆవిష్కరిస్తున్న కవులు

గాడ్ వైభవం పుస్తకావిష్కరణ

రాయవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆదివారం పిఠాపురం గ్రామానికి చెందిన కోట శ్రీను దత్త రచించిన గాడ్ వైభవం పుస్తకావిష్కరణ నిర్వహించారు. తొలుత శ్రీను దత్త విజయ దుర్గా అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం గాడ్ వైభవం పుస్తకాన్ని పీఠాధిపతి గాడ్ సమక్షంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా శ్రీను దత్తను అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఠం ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పి.సత్యకనకదుర్గ, పీఆర్వో బాబి తదితరులు అభినందించారు.



వెదురుపాకలో గాడ్ వైభవం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠం ప్రతినిధులు

ఉత్తమ పశువైద్యాధికారిగా బిందు

కె.గంగవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ పశువైద్యాధికారిగా పామర్రు పశువైద్యా. ధికారిణి ఎం.బిందు ఎంపికయ్యారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో బిందుకు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి కె. వెంకట్రావు ప్రసంసాపత్రం అందజేశారు. అవార్డు పొందిన ఆమెను రామచంద్రపురం పశుసంవర్ధకశాఖ ఏడిఏ ఓ.రామకృష్ణ, నియోజక వర్గంలోని పశువైద్యులు ఎం. కృష్ణార్జున, భావనజ్యోతి తదితరులు అభినందించారు.

టీడీపీ కూళ్ల గ్రామ కమిటీ ఎన్నిక

కె.గంగవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీపీ కూళ్ల గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిట్టూరి సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా వాసంశెట్టి గంగరాజు, కోశాధికారిగా కుడప శ్రీధర్, కార్యదర్శిగా పిల్లి వీరేంద్రలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు.

జలజీవన్ మిషన్ పథకాన్ని అన్ని గ్రామాల్లో అమలు చేయాలి

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ

మండపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జలజీవన్ మిషన్ కార్యక్రమం అన్ని గ్రామాల్లో అమలు చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాలు, పట్టణాల్లో అందించే మంచినీరు అందించుతున్నప్పటికి ప్రజలకు చాలటం లేదన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని గ్రామాల్లో జలజీవన్ మిషన్ కార్యక్రమాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

దారికాచి సెల్‌ఫోన్ దోపిడీ

ద్రాక్షారామ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వీరేశగుళ్ల కాలనీ వద్ద శనివారం సాయంత్రం సమయంలో తమిళనాడు వ్యక్తి వద్ద దారికాచి దోపిడీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడుకు చెందిన సుధాకర్ వేళాయుధం మూడు నెలల క్రితం వరికోత యంత్రాన్ని తీసుకువచ్చి ఈ ప్రాంతంలో వరి కోతలు కోయిస్తున్నాడు. వరికోత యంత్రానికి డీజిల్ కోసం మోటారు సైకిల్‌పై పెట్రోల్ బంకు వద్దకు వచ్చాడు. ఈలోగా నలుగురు వ్యక్తులు రెండు మోటారు సైకిళ్లపై వచ్చి వేళాయుధం వద్ద నుంచి రూ.10 వేల నగదు, సెల్‌ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. వేళాయుధం ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

మండపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండపేట కేపీరోడ్డులో వున్న శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయ శాఖ అధికారిణి ఎస్. పూర్ణమ్మ తెలిపారు. ఈమేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 28 నుంచి జూన్ 6వరకు పది నుంచి 15 సంవత్సరాల వయస్సు కలిగిన బాలబాలికలు తరగతులకు అర్హులన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి 11 వరకు విద్యార్థులకు ప్రతిరోజు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేటి నుంచి గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

ద్రాక్షారామ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో నేటి నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు శాఖా గ్రంథాలయ అధికారి ఎంవీ సూరిబాబు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 వరకు కథలు చెప్పడం, కథలు చదవడం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్, సంగీతం తదితర అంశాలలో శిక్షణ ఇస్తారన్నారు. ద్రాక్షారామ పరిసర ప్రాంతాల పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొనాలని ఆయన కోరారు.

కొనసాగుతున్న మహిళ

రిలే నిరాహారదీక్ష



మండపేట, ఏప్రిల్, 27 (ఆంధ్రజ్యోతి) కేశవరం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ కోసం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి చేస్తున్న నిరాహారదీక్ష ఆదివారం పదో రోజుకు చేరింది. గ్రామంలో వున్న కోకోకోలా సంస్థ ప్రహరీ నిర్మాణానికి నిధులు ఇచ్చినా స్థానిక రాజకీయాల వల్ల ప్రహరీ నిర్మించకుండా జాప్యం జరుగుతోందని ఆమె ఆరోపించారు. పాఠశాలలో రాజకీయాలకు తావు లేదని అలాంటిది గ్రామంలోని రాజకీయాల వల్ల పాఠశాల ప్రహరీ నిర్మాణానికి గ్రహణం పట్టిందని ఆమె అన్నారు. ఆమె దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు. పాఠశాల ప్రహరీ విషయంలో జాప్యం చేయకుండా తక్షణమే వాటి పనులు చేపట్టాలన్నారు. అప్పటి వరకు తాను దీక్ష కొనసాగిస్తానని ఆమె హెచ్చరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కేసు నమోదు

కొత్తపేట, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మోడేకుర్రు వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేశారు. అమలాపురం నుంచి వస్తున్న వాహనంలో మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు గుర్తించారు. ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామానికి చెందిన గుబ్బల వీరవెంకట రమణ అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించి రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసినట్లు కొత్తపేట ఎస్‌ఐ జి.సురేంద్ర తెలిపారు.



ముసలమ్మ తీర్థంలో కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరంలో ఘనంగా పుంతలో ముసలమ్మ తీర్థం

రాయవరం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): రాయవరం గ్రామదేవత శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చైత్రమాసంలో వచ్చే అమావాస్య రోజున అమ్మవారి తీర్థం నిర్వహించడం ఆనవాయితీ. శనివారం రాత్రి జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని రాష్ట్ర ప్రభుత్వ అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు దర్శించుకుని మొక్కు చెల్లించారు. తీర్థాన్ని పురస్కరించుకుని అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, నైవేద్యం, చీరలు, పానకం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకుడు ఉండవిల్లి రాంబాబు తదితరులు ఉన్నారు. తీర్థాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కోలాటం, బుర్రకథ ఆకట్టుకున్నాయి.